సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



ఘనంగా తులసీదళార్చన
విశాఖ: నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీద ళార్చనను ఘనంగా నిర్వహించారు.



అప్పన్నకు నిత్య కల్యాణం
సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి గురువారం ఉదయం నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



గిరిజనాభివృద్ధిలో నవశకం
ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఊహించని స్థాయిలో మన్యం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది.
IIIలో

న్యూస్‌రీల్

53.13 శాతం మేర పింఛన్ల పంపిణీ



వంతాడపల్లిలో వృద్ధులకు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేస్తున్న గ్రామ వలంటీర్

సాక్షి,పాడేరు: జిల్లాలో దట్టంగా కురుస్తున్న పొగ మంచు, మరోవైపు చలిగాలులు విజృంభిస్తున్న ప్పటికీ సామాజిక పింఛన్‌దారులకు పొద్దుపొద్దు నే వైఎస్సార్ పింఛన్‌కానుక సొమ్మును గ్రామ వలంటీర్లు అందజేశారు. జిల్లాలో 1,28,962మం ది పింఛనుదారులకు రూ.39,97,01,000 పం పిణీ చేయాల్సి ఉంది. అయితే గురువారం సా యంత్రానికి 68,667 మందికి రూ.20,77,14, 000ను అందజేశారు. 53.13 శా తం పంపిణీ జరి గినట్టు అధికార యంత్రాంగం తెలిపింది.

ఎంపీడీవోగా వీరసాయిబాబు
చింతపల్లి రూరల్: చింతపల్లి ఎంపీడీవోగా వి.వీరసాయిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పి.ఆశాజ్యో తిని కాకినాడ జిల్లా పెదపూడికి బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న వీరసాయిబాబుని చింతప ల్లి ఎంపీడీవోగా ప్రభుత్వం నియమించింది. ఈయనకు ఏవో రవీంద్ర, జూనియర్ అసిస్టెం ట్ జాన్ దయానంద్, కార్యదర్శి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు



రోగులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్లు మాధురి, కృష్ణమూర్తి

సాక్షి, పాడేరు: స్థానిక జిల్లా ఆస్పత్రిని ట్రైనీ కలె క్టర్లు మాధురి, కృష్ణమూర్తి గురువారం సంద ర్శించారు. అన్ని విభాగాలతో పాటు వైద్యసే వలు పొందుతున్న రోగుల వార్డు గదులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమ లతాదేవి, వైద్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



పాడేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు



నక్కలపుట్టు రోడ్డులో చలిమంటను ఆశ్రయించిన యువకులు

సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు అధికమ య్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతు న్నాయి. సాయంత్రం నుంచి చలి తీవ్రత ఎక్కు వగా ఉండటంతో చలిమంటలను ఆశ్రయిస్తు న్నారు. రాత్రి 11 గంటల నుంచి పొగ మంచు దట్టంగా కురుస్తోంది.ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు.గురువారం ఉద యం అరకులోయ కాఫీ బోర్డు వద్ద 13.2డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు సంబం ధిత అధికారవర్గాలు తెలిపాయి.

వెయ్యి లీటర్ల పులుపు ధ్వంసం



సారా తయారీ పాత్రలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పాడేరు : సారా తయారీ, అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని పాడేరు సీఐ నవీన్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని మినుములూరు పంచాయతీ కోడిగుడ్డు గ్రామ శివారులోని కొం డపైగల సారా తయారీ స్థావరాలపై గురువారం స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల పులుపును ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్‌ఐ రం జిత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మిరియం రైతుకు మంచి రోజులు

కాఫీలో అంతర పంటగా సాగు చేస్తున్న మిరియాల రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఇప్పటివరకు దళారులు నిర్ణయించిన ధరకు విక్రయిస్తున్న రైతుల నుంచి ఈ ఏడాది పాడేరు ఐటీడీఏ కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కలెక్టర్ సుమిత్‌కు మార్ కిలో రూ.500 కొనుగోలు చేయాలని ఆదేశించడంతో గిరి రైతుల్లో ఆనందం నెలకొంది.

- గిట్టుబాటు ధర ప్రకటించిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో కిలో రూ.500 చొప్పున కొనుగోలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- దళారులకు చెక్ పెట్టిన నిర్ణయం



మోదాపల్లి పంచాయతీ గుర్రగరువులో పొదుల నుంచి మిరియాలను సేకరిస్తున్న గిరి రైతులు



సేకరించిన పచ్చిమిరియాలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులుకాఫీ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న మిరియా లకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోంది. పాడేరు ఐటీడీఏ చరిత్రలో తొలిసారిగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మిరియాలను గిట్టుబాటు ధరతో కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కలెక్టర్ ప్రకటనతో..

మిరియాలు కిలో రూ.500 ధరను కలెక్టర్ సుమిత్‌కు మార్ రెండు రోజులక్రితం గిట్టుబాటుధరను ప్రకటించారు. ఇదే ధరతో కొనుగోలు చేసేందుకు పాడేరు ఐటీడీఏ ఏర్పాట్లు చేస్తుండటంతో దళారు లకు చెక్ పెట్టినట్టే. వ్యాపారులు కిలో రూ.400ధ రకు మించి కొనుగోలు చేయకపోవడంతో గిరిజన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పాడేరు ఐటీడీఏ స్వయంగా మిరియాల కొనుగోలుకు సిద్ధ పడటంతో గిరి రైతుల్లో ఆనందం నెలకొంది.

కలిసొచ్చిన వాతావరణం

మిరియాల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉన్నందున మంచి దిగుబడి రావడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గింజలు దిగుబడి దశకు చేరుకోవడంతో గిరిజన రైతులంతా వాటిని సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. సేంద్రియ విధానంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న మిరి యాలకు జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అంతేకాకుండా మన్యం మిరియాలు నాణ్య తలో నంబర్ వన్‌గా నిలవడంతో దేశంలో మంచి డిమాండ్ ఉంది.

రూ.50 వేలకు మించి అదనపు ఆదాయం

ఏజెన్సీ 11 మండలాల పరిధిలోని 2.21లక్షల ఎక రాల్లో గిరిజన రైతులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సాగు చేస్తున్నారు. కాఫీ తోటల్లో గిరిజన రైతులు అంతర పంటగా సుమారు 50 ఎకరాల్లో మిరియాన్ని సాగుచేస్తున్నారు. ఎకరా నికి 400 లోల వరకు పచ్చి మిరియాలు దిగుబడి



ఎండు మిరియాలు

వస్తున్నట్టు గిరి రైతులు తెలిపారు. వీటిని శుద్ధి చేసిన అనంతరం వంద కిలోలు ఎండు మిరి యాలు వస్తున్నట్టు వారు పేర్కొన్నారు. కిలో రూ.500 ధరకు విక్రయించడం ద్వారా ఒకొక్క రైతుకు రూ.50 వేలకు మించి అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ఐటీడీఏ కొనుగోలుతో మేలు



మిరియాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఏటా ఆర్థికంగా నష్టపోతున్నాం. వ్యాపారులు తమ వద్దకు వచ్చినా, తాము సంతలకు తీసుకువెళ్లినా ఇప్పటివరకు వారు నిర్ణయిం చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.500 ధర నిర్ణయించడంతో తమకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది. – మాదెలి నాగన్న, రైతు, కోట్లగరువు, పాడేరు మండలం

రైతుకు ఆర్థికంగా ఆసరా



ఏజెన్సీలో గిరిజన రైతులు కాఫీలో అంతరపంటగా సాగుచేస్తున్న మిరియాలకు నాణ్యతలో నంబర్–1గా గుర్తింపు ఉంది. అందుకు తగ్గట్టుగా గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతోపాడేరు ఐటీడీఏ ద్వారా కొనుగో లుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. కిలో రూ.500 ధర నిర్ణయించడం వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరు గుతుంది. – సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

టీడీపీని ఓడించడమే లక్ష్యం

పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపు

అనంతగిరి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని మళ్లీ ఓడించడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. మండలంలోని శివలింగపురం వద్ద నాయకులు, కార్యకర్తలతో ఆయన గురువారం సమావేశమయ్యారు. అనం తరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్య మంత్రి జగనన్న పాలనలోని ప్రజలందరూ సం తృప్తిగా ఉన్నారని, ఓవైపు సంక్షేమం, అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు విడుదలచేశారన్నారు. గిరి గ్రామాలు ప్రస్తుతం అభివృద్ధిబాటలో నడుస్తు న్నాయన్నారు.

ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఓటుతోనే టీడీపీ పార్టీకి బుద్ధిచెప్పేందుకు ప్రజ లందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు గెలుపునకు ప్రతి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ఒక్కరు సైనికుల్లా పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, ఎంపీటీ సీలు మితుల, అశోక్, సర్పంచులు మజ్జి అప్పా రావు, సన్యాసిరావు, జిల్లా జేఏసీ కోఆర్డినేటర్ గంగులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కొర్రా సూర్య నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బా రావు, డానియేలు, నవీన్, తదితరులు పాల్గొ న్నారు.

ఆర్‌ఐవోగా మురళీధర్ బాధ్యతల స్వీకరణ

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్ష ణాధికారి(ఆర్‌ఐవో)గా పి.మురళీధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్‌ఐవోగా పనిచేసిన రాయల సత్యనారాయణ ఉద్యోగ విర మణ చేయటంతో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న మురళీధర్‌కు ఆర్ ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇం టర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విధుల్లో చేరిన ఆయనకు పూర్వ ఆర్‌ఐవో సత్యనారాయణ పూర్తి బాధ్యతలను అప్పగించారు. జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి బి.రాధ, కార్యాలయ సూపరింటెండెం ట్ గణేష్ , సిబ్బంది మురళీధర్‌కు మర్యాదపూర్వ కంగా పుష్పగుచ్ఛం అందజేసి, ఆహ్వానించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో డీవీ



మురళీధర్‌ను అభినందిస్తున్న డీవీఈవో రాధ, సూపరింటెండెంట్ గణేష్

ఈవోగా, బోర్డులో జాయింట్ సెక్రటరీ హోదాలో పనిచేసిన అనుభవంతో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆర్‌ఐవో మురళీధర్ తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

రంపచోడవరం: రక్తదానం ప్రాణదానంతో సమా నమని రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు అన్నారు. రంపచోడవరంలో ఏఎస్పీ జగదీష్ అడ హళ్లి ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రం పచోడవరం సబ్ డివిజన్‌లోని పది పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఆటో యూనియన్ డ్రైవర్లు, స్థానికులు తదితర 32 మంది రక్తదానం చేశారు. ఎస్‌ఐ ఎం మోహన్‌కుమార్, రం పచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. కె లక్ష్మి, ఏఎస్‌ఐ సత్యసాయి, ఆస్పత్రి సిబ్బంది కౌన్సిలర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని కిడ్నాప్ చేసిన యువకుడి అరెస్టు

హుకుంపేట: ఇంటర్ విద్యార్థినికి మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి నట్టు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సన్యాసమ్మపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని అరకువేలీలోని ఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి పండగ సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చిన ఆమె జనవరి 22వ తేదీన కళాశాలకు బయలు దేరింది. అప్పటి నుంచి ఆమె కనిపించకపోవడంతో బంధు వులు,స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె తండ్రి స్థానిక పోలీ సులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థిని ఆచూకీ కనుగొ న్నారు. ఆమెను గత నెల 29న తల్లిదండ్రులకు అప్పగించారు. ఆమెను కిడ్నాప్ చేసిన అనకాపల్లి జిల్లా చీడికాడ మండల కేంద్రానికి చెందిన



విద్యార్థినిని కిడ్నాప్ చేసిన వ్యక్తితో ఎస్‌ఐ సతీష్, పోలీసులు

యువకుడు కింతాడ సంతోష్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. అత నిపై ఫోక్సో, కిడ్నాప్, చీటింగ్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

8న పాడేరులో ప్రేరణ

పాడేరు : గిరిజన నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న పాడేరులో ప్రేరణ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ నవీన్‌కుమార్ తెలి పారు. మండలంలోని మినుములూరు గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల సం దర్భంగా ఎక్కడా గొడవలు, ఘర్షణలకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామ న్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రేరణ



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న పాడేరు సీఐ సుధాకర్

కార్యక్రమంలో టాటా కంపెనీ ప్రతినిధులు పాల్గొం టారని తెలిపారు. పాడేరు ఎస్‌ఐ రంజిత్‌కుమార్, పోలీస్ శాఖ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

‘గిడ్డి’ తప్పుడు ప్రచారం సిగ్గుచేటు

వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

చింతపల్లిరూరల్: మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటు అని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. ఎర్రవరం పవర్ ప్రాజెక్టుకు తాను బినామీనని తప్పుడు ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నిరూపిస్తే తాను రాజ కీయ సన్యాసం తీసుకుంటానని.. లేకుంటే మీరు తీసుకుంటారా అని సవాల్ విసిరారు. ఇకపై అలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆయన హెచ్చ రించారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున విజయం సాధించి ఆ తరువాత టీడీపీ అందించిన ముడుపులు తీసుకుని ఆ పార్టీలో చేరడం గిరిజనుల మనోభావా లను దెబ్బతీసింది చాలదా అని ఆయన ధ్వజమె త్తారు. తప్పుడు ప్రచారం చేసినంత మాత్రాన ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో వారు గుణపాఠం తప్పనిసరిగా చెబుతారన్నారు. తమ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే సత్తాలేక ఇటువంటి అసత్య ప్రచారానికి దిగుతున్నారని ఆయన విమర్శించారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎర్రబొమ్మల సర్పంచ్ పండయ్య, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, ఎంపీటీసీలు ధారలక్ష్మి, జయలక్ష్మి, మోహన్‌రావు, మండల మైనారిటీ అధ్యక్షుడు నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణను చూసి ఓర్వలేకనే విమర్శలు

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమ



మాట్లాడుతున్న మత్స్యరాస విశ్వేశ్వరరాజు

న్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్‌లు కిముడు రాంబాబు, లసం గి మాలన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్ల మత్స్యకొండనాయుడు ఆరోపించారు. పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం వారు మాట్లా డుతూ రాబోయే ఎన్నికల్లో ఆమెకు విశ్వేశ్వరరాజు చేతిలో ఓటమి తప్పదన్నారు. దీనిని తట్టుకోలేకనే వాస్తవ విరుద్ధంగా విమర్శలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పుణ్యమా అంటూ ఎమ్మెల్యేగా గెలి చిన ఆమె సిగ్గులేకుండా టీడీపీకి అమ్ముడుపోయిం దని విమర్శించారు. తిరిగి వైఎస్సార్ నేతలపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. పార్టీ మం డల నాయకులు పండన్న, బాబూరావు, శ్రీనివాస్, వేణుబాబు, లక్ష్మణ్ బాలయ్యపడాల్ పాల్గొన్నారు.

గిరిజనేతరులకు ‘గిడ్డి’ బినామీ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కూడా సురేష్‌కుమార్

పాడేరు : పాడేరు నియోజకవర్గంలో గిరిజనేతరు లకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి బినామీగా వ్యవహరిస్తు న్నారని వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి కూడా సురేష్‌కుమార్ గురు



జి.మాడుగులలో మాట్లాడుతున్న సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నేతలు

వారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పాడేరు అసెంబ్లీకి టీడీపీ టికెట్ రాదనే అక్కసుతోనే తమ పార్టీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. పార్టీ సమన్వ యకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు నియోజకవర్గం లో ఏ కంపెనీకి, ఏ గిరిజనేతరుడికి బినామీగా లేర న్నారు. గిడ్డి ఈశ్వరి మాత్రం టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవింద్‌కు బినామీగా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున గెలి చిన ఆమె రూ.కోట్ల విలువైన తెరపల్లిలో గ్రానైట్ క్వారీకి ఆశ పడి టీడీపీలోకి వెళ్లిన విషయం నియో జకవర్గంలో ప్రతి ఒక్కరికి తెలుసునన్నారు. పాడేరు ఆర్టీసీ డిపో స్థలాలకు సంబంధించి గిరిజనుల హక్కులు, చట్టాలను కాలరాస్తూ వాటిని దొడ్డిదారిన ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపిం చారు. వాటిలో అద్దెకు దిగబోతున్న ఒకొక్కరి నుం చి రూ.15లక్షల సొమ్ము తీసుకుని భవంతులు నిర్మిస్తున్న చరిత్ర గిడ్డి ఈశ్వరిదన్నారు. తక్షణమే ఆమె తన వాఖ్యలను వెనక్కి తీసుకొని తమ పార్టీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు భేషర తుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆశ.. నిరాశ

- కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు మొండిచేయి
- టైర్–2 సిటీల కేటగిరీలో పెరగనున్న విమాన సర్వీసులు
- వందేభారత్ బోగీల సంఖ్య పెరిగే చాన్స్



సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ విశాఖ వాసులను నిరాశ పరచింది. ఇత మిద్ధంగా ఎలాంటి కేటాయింపులు లేకుండా సాగింది. ప్రధానంగా రైల్వే జోన్‌పై గాని, విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి గాని ఊరటనిచ్చే ప్రకటన చేయలేదు. రైల్వే జోన్‌పై డీపీఆర్ సిద్ధమైందన్న సమాచారం తప్ప ఇతరత్రా స్పష్టత కొరవడింది. కొన్నాళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నానికి వ్యతిరేకంగా ఉద్యమాలు, ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసం హరణ మొత్తాన్ని గతేడాదికంటే పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీంతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ఆందోళనకు ఫుల్ స్టాప్ పడలేదు. దీనిపై ఈ బడ్జెట్‌లో ఏదైనా సాను కూల నిర్ణయం వెలువడుతుందన్న ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్టుకు నిధుల కేటాయింపును కూడా విస్మరిం చడం ఈ ప్రాంత వాసులకు విస్మయానికి గురిచే సింది. ఇంకా విశాఖ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు గురించిన ప్రస్తావన కూడా బడ్జె ట్‌లో లేదు. విశాఖలో అభివృద్ధి, ఉపాధికి దోహదం చేసే కొత్తగా సంస్థల ఏర్పాటు జోలికీ వెళ్లలేదు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ మెజార్టీ వర్గాలను నిరాశకు గురి చేసింది.

గుడ్డిలో మెల్లలా..

దేశంలోని టైర్–2, 3 నగరాలకు ఉడాన్ పథకం కిం ద కొత్త విమాన సర్వీసులను పెంచాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా విమానయాన సం స్థలు కొత్తగా వెయ్యి విమానాల కొనుగోళ్లకు ఆర్డరి చ్చాయి. దీంతో విశాఖ విమానాశ్రయానికి మరి కొన్ని విమాన సర్వీసులు పెరిగే అవకాశం ఉంది. బడ్జెట్‌లో పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నట్టు చేసిన ప్రకటన ఈ రంగంలో అలరారుతున్న విశా ఖకు ఒకింత ప్రయోజనం చేకూర్చే అంశంగా కనిపి స్తోంది. ఇక దేశవ్యాప్తంగా 40 వేల వందేభారత్ బోగీలను ప్రవేశపెడ్తామని ఆర్థిక మంత్రి ప్రకటిం చారు. ఫలితంగా విశాఖ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు ఈ ఆధునిక సదుపాయాలున్న బోగీలు అమర్చే అవకాశం కలుగుతుంది. గుడ్డిలో మెల్లలా అంతకు మించి ఈ బడ్జెట్‌లో విశాఖకు ఒన గూరిన ప్రయోజనాలు కనిపించక పోవడం విశేషం ! కాగా విశాఖకు మొండి చేయి చూపించినప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో దీర్ఘకాలిక ప్రయోజనాలకు ఆస్కారం ఉందన్న అభిప్రాయాన్ని కొన్ని వర్గాల ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు.

విశాఖకు, రాష్ట్రానికి అన్యాయం



ఈ బడ్జెట్‌లో విశాఖకు, రాష్ట్రానికి అన్యాయం జరిగింది. విశాఖ ఉక్కును ప్రభుత్వ రం గంలో కొనసాగించడంపై హామీ లేకపోవడం దుర్మార్గం. బడ్జెట్‌లో 99 శాతం మందికి ఎలాంటి ఉపశమనం లేదు. కార్పొరేట్లకే తప్ప పేద, మధ్య తరగతి వారికి ప్రయోజనం లేదు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అనడంలో సందేహం లేదు. – ఎం.జగ్గునాయుడు, సీపీఐ(ఎం) విశాఖ జిల్లా కార్యదర్శి

ఉక్కు రంగానికి ఊతం



కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వస తుల కల్పనకు రూ.11.11 లక్షల కోట్ల కేటాయింపు, పీఎంఏవై కింద రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం, మూడు రైల్వే కారిడార్లు, ఉడాన్ స్కీంలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం వంటి వాటి వల్ల ఉక్కు వినియోగం బాగా పెరుగుతుం ది. ఇది ఉక్కు రంగానికి ఊతాన్నిస్తుంది. ఈ అవ సరాలను తీర్చడంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కూడా పాలుపంచుకుంటుందన్న నమ్మకం ఉంది. – అతుల్ భట్, సీఎండీ, ఆర్‌ఐఎన్‌ఎల్

అభివృద్ధి, ఉపాధికి ఆస్కారం



కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు కేటా యింపులు లేకపోయినా, దేశం లోని వివిధ రంగాలకు మేలు చేసేదిగా ఉంది. మౌలిక వసతు ల రంగానికి భారీగా నిధులు కేటాయింపుతో రైల్వే, విమానయాన, పోర్టు తదితర రంగాల్లో పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. పర్యాట కరంగాభివృద్ధికి, సాంకేతిక రంగంలో ప్రైవేటు సంస్థల ఆర్‌అండ్‌డీకి వడ్డీ లేని రుణాలు మంచి పరిణామం. – నరేష్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్

క్లుప్తంగా

నేడు ఐటీడీఏలో స్పందన

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు అందజేయాలన్నారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ఇంటర్ ఎన్విరాన్‌మెంట్ పరీక్ష వాయిదా

అడ్డతీగల: ఈనెల 3వ తేదీ శనివారం జరగవలసిన ఇంటర్ ఎన్విరాన్‌మెంట్ పరీక్షను ఈనెల 23 తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఇంటర్ బోర్డ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వాయిదా పడిన పరీక్ష 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులకు ప్రిన్సిపాళ్లు తెలియజేయాలని ఆయన కోరారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డులు


కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా ఇద్దరు యువకులను లైఫ్ గార్డ్స్ కాపాడారు. బిహార్‌కు చెందిన 9 మంది యువకులు గురువారం సాయంత్రం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులంతా సరదాగా గడిపి బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో వీరిలో ఆసద్ (28), సోహిల్ (30) కొట్టుకుని పోతుండగా... అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ చందు, సూరాడ నూకరాజు, డి.కార్తీక్, ఎం.అమ్మోరు, సతీష్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. యువకులకు మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

నేటి నుంచే క్రికెట్ పండగ

విశాఖలో 1988లో జరిగిన తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ మొదలుకుని.. ఇటీవల జరిగిన టీ–20 మ్యాచ్ వరకు.. ఎన్నెన్నో జ్ఞాపకాలకు విశాఖ క్రీడాభిమాని హృదయం నిలయం. క్రికెట్ గురించి ప్రస్తావిస్తే చాలు మనసు తెర మీద చిటికెలో ప్రత్యక్షమయ్యే అద్భుతాల చిత్రాలు.. ఇక్కడ అభిమానులను అనంతానందాల వెల్లువలో మునకలేయిస్తాయన్నది వైఎస్సార్ స్టేడియం సాక్షిగా తిరుగులేని నిజం. ఈ సంతోషాల పరంపరలో మరో మహత్తర ఘట్టం శుక్రవారం ఆవిష్కృతం కానుంది. సిరీస్‌లో 0–1తో వెనుకబడిన టీమిండియాకు ఈ టెస్ట్ మ్యాచ్ ఎంతో కీలకం. అచ్చొచ్చిన స్టేడియంలో విజయం సాధిస్తే.. చరిత్ర పుటల్లో మరోసారి విశాఖ పేరు లిఖితం కానుంది.

– విశాఖ స్పోర్ట్స్


ప్రాక్టీస్ సెషన్‌లో భారత జట్టు సభ్యుల సమాలోచన

ఆతిథ్య భారత్ జట్టుకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఫేవరేట్ మైదానం. గతంలో ఇక్కడ జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన భారత్.. ముచ్చటగా మూడో విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేయాలని భావిస్తోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండో టెస్ట్ మ్యాచ్ శుక్రవారం ప్రారంభం కానుంది. గతంలో ఇదే వేదికపై 2016లో తొలిసారిగా ఇంగ్లండ్‌తో భారత్ తలపడి విజయం సాధించింది. 2019లో దక్షిణాఫ్రికా జట్టు తో జరిగిన మ్యాచ్‌లో విజేత కేతనం ఎగురవేసింది. ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో భారత్ 0–1తో తొలి టెస్ట్‌ను కోల్పోగా.. రెండో మ్యాచ్‌లో విజయ మే లక్ష్యంగా నెట్స్‌లో తీవ్రంగా శ్రమించింది. రెండు రోజుల పాటు ఇరు


నెట్ ప్రాక్టీస్ చేస్తున్న యశస్వీ జైశ్వాల్

జట్లు ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాయి. ఆధిక్యాన్ని కొనసాగించేందుకు ఇంగ్లండ్, లెక్క సరిచేసేందుకు భారత్ ప్రణాళికలతో మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి. తొలి టెస్ట్‌లో రివర్స్ స్వీప్‌తో ఇంగ్లండ్ జట్టు భారత్ బౌలర్లకు చుక్కలు చూపించి బజ్‌బాల్ ఫార్ములాతో విజయాన్ని సొంతం చేసుకుంది. ఓ వైపు ఫీల్డింగ్ లోపాలతో క్యాచ్‌లు జారవిడవడంతో భారత్ గెలుపునకు చేరువై తొలి టెస్ట్ కోల్పోయింది. గడిచిన రెండు రోజుల్లో ఇలాంటి లోపాలను సరిదిద్దుకుని పూర్తి సంసిద్ధతతో ఉన్నామని జట్టు సభ్యులు చెప్పడంతో విశాఖ మ్యాచ్‌పై అభిమానులు ఆసక్తి పెంచుకున్నారు. విరాట్ కోహ్లీ విశాఖ మ్యాచ్‌కు సెలవు తీసుకోగా.. తొలిటెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటర్ కె.ఎల్ రాహుల్, రవీంద్ర జడేజా తొడకండరాలు పట్టేడయంతో ఈ మ్యాచ్‌కు అందుబాటులో


ఫుట్‌బాల్ డ్రిబిల్ చేస్తున్న ఇంగ్లండ్ ఆటగాళ్లు

లేరు. వీరి స్థానాల్లో మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్, స్పిన్ ఆల్‌రౌండర్ సౌరభ్‌కుమార్‌లతో పాటు బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకున్నారు. వీరంతా విశాఖలో జోరుగా ప్రాక్టీస్ చేశారు. విశాఖ పిచ్ స్పిన్‌కు అనుకూలం కావడంతో గతంలో ఇదే వేదికపై జరిగిన ఇంగ్లాండ్–భారత్ టెస్ట్ మ్యాచ్ రెండు రోజులకే ముగిసింది. విశాఖలోని సెంటర్ పిచ్‌లో జరగనున్న ఈ మ్యాచ్ బ్యాటింగ్‌కు అనుకూలించేది అయినా శని, ఆదివారాల్లో స్పిన్‌కు సహకరించే అవకాశం ఉందనేది నిపుణుల అభిప్రాయం. ఇంగ్లండ్ తరఫున షోయబ్ బషీర్ అరంగేట్రం చేయనుండగా హార్ట్‌లీ, రెహాన్‌లు తోడు కానున్నారు. స్పిన్నర్ జాక్‌లీచ్ మోకాలి గాయంతో జట్టుకు దూరమయ్యాడు. భారత్ యువ బ్యాటర్లు తొలి టెస్ట్‌లో.. అందునా రెండో ఇన్నింగ్స్‌లో కఠినమైన పరిస్థితులు ఎదుర్కొన్నారు. గతంలో ఇదే వేదికపై రెండు టెస్ట్ సెంచరీలు సాధించిన రోహిత్ ఈ సారి ఓపెనర్ గానే కాక జట్టును సమష్టిగా ముందుకు నడిపించనున్నాడు. వైస్ కెప్టెన్ బుమ్రా ఆది నుంచే ప్రత్యర్థిని ఎలా కట్టడి చేస్తారనే దానిపైనే అందరిలో ఆసక్తి నెలకొంది. ఇక ఇదే వేదికపై భారత్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ టాస్ గెలిచి.. విజయం సాధించింది. మరికొన్ని గంటల్లో ప్రారంభం కానున్న మ్యాచ్ కోసం అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మ్యాచ్ కోసం పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు.

కష్టపడితే విజయం సొంతం


భరత్‌ను సత్కరిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ స్పోర్ట్స్: కష్టపడితే విజయం సాధించవచ్చనేందుకు ఉదాహరణే విశాఖ నుంచి అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగిన భరత్ అని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అన్నారు. వైఎస్సార్ స్టేడియంలో గురువారం జరిగిన కె.ఎస్.భరత్ సత్కార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విశాఖ యువత భరత్ సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకుని రాణించాలని పిలుపునిచ్చారు. భరత్ ఎదుగుదలలో ఏసీఏ తోడ్పాటు, తల్లిదండ్రులు పాత్ర పేర్కొనదగిందన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 2013లో ఏసీఏ తరఫున దేశవాళీ క్రికెట్‌లో రాణించిన భరత్.. ఓ వికెట్ కీపర్ ట్రిపుల్ సెంచరీ చేయడంతో అందరి దృష్టిని ఆకర్షించాడన్నారు. పదేళ్ల పాటు ముస్తాక్ అలీ, విజయ్ హజారే లాంటి ట్రోఫీల్లో చక్కగా రాణించి ఏపీఎల్‌లో సయితం ఆడాడన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌కు వికెట్ల వెనుక నిలవడం, ఏసీఏ తరఫున విశాఖ నుంచి ఎదగడం గర్వించదగ్గ విషయమన్నారు. వరల్డ్ టెస్ట్ క్రికెట్ ఫైనల్‌కు భారత్ జట్టుకు ఎంపికయ్యాడని గుర్తు చేశారు.

అనుమానాస్పదస్థితిలో వలంటీర్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ, సీఐలు

మాకవరపాలెం : అనుమానస్పద స్థితిలో వలంటీర్ మృతి చెందాడు. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన నడింపల్లి హరి(24) వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి 9 గంటల వరకు ఇంటి వద్దనే ఉన్న హరి బయటకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో గ్రామ శివారున గల పంట భూమిలో గురువారం మధ్యాహ్నం మృతిచెంది కనిపించాడు. విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలియజేయడంతో తొలుత స్థానిక ఎస్ఐ రామకృష్ణారావుతోపాటు నర్సీపట్నం రూరల్, టౌన్ సీఐలు హరి, గణేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ముఖంపై బలమైన గాయాలు ఉండడంతో ఎవరైనా హత్య చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే క్లూస్ టీంతోపాటు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వలంటీర్ హరి గురువారం ఒకటోతేదీ కావడంతో పింఛన్ల పంపిణీకి నగదు తీసుకున్నాడని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నగదు కోసం ఎవరైనా హరిని హతమార్చారా లేక వివాహేతర సంబంధం ఏదైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడికి ఒక సోదరుడు ఉన్నాడు. హరి మృతితో కుటుంబీకులు సంఘటన ప్రాంతానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు.


వలంటీర్ హరి(ఫైల్)

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం నేడు

భీమునిపట్నం: భీమిలి వుడా మైదానంలో శుక్రవారం నుంచి విశాఖ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్ – 14 చాంపియన్‌షిప్ పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నామని విశాఖ రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.లలిత్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీల నిర్వహణకు భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్ స్కూల్ సహకారం అందిస్తోందన్నారు. రాష్ట్ర స్థాయిలో 13 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొంటాయని, వారందరికీ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడలపై పిల్లలకు ఆసక్తి పెంపొందిస్తే మంచి క్రీడాకారులుగా రూపొందుతారని, ఇదే తమ లక్ష్యమన్నారు. పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు, అసోసియేషన్ కార్యదర్శి పి.అరుణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు

- క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పించండి
- అల్లూరి పశుసంవర్ధక శాఖ డీడీ నర్సింహులు

రావికమతం: రైతులకు ఆదాయాన్నిచ్చే జీవాల పోషణలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అవలంబించేలా పశువైద్యులు, గోపాల మిత్రలు తగిన సలహాలు, సూచనలివ్వాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్ నర్సింహులు అన్నారు. మండలంలోని పశువైద్యాధికార్లు, గోపాలమిత్రలతో ఆయన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులకు వ్యవసాయం తర్వాత అధిక ఆదాయాన్నిచ్చేవి కోళ్లు, పాడి పశువులు, గొర్రెలు ఇతర జీవాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. వాటి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే త్వరితగతిన లాభాలు పొందవచ్చన్నారు. ఆరోగ్య వంతమైన ఉత్పాదక సామర్థ్యం వస్తుందన్నారు. పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకుతుండటం వల్ల పశువుల ఆరోగ్య చెడిపోవడమే కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీని నివారణ, టీకాలు వేయించుకునే పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కొన్ని వ్యాధులు ముదిరితే పశువుల నుంచి మనుషులకు సోకే అవకాశం ఉందన్నారు. కోడి, గొర్రె మాంసాలు పాడైతే వాటి ప్రభావం రైతుపై పడుతుందన్నారు. ఈ దృష్ట్యా రైతులకు సవివరంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ పుష్ప తదితరులు పాల్గొన్నారు.


పశువైద్యాధికారులు, గోపాలమిత్రలకు సూచనలిస్తున్న నర్సింహులు

రూ.లక్షలు విలువ చేసే పైపులు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నర్సీపట్నం : తాగునీటి పైపులైన్‌కు వాడే పైపులు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.35 లక్షల నుండి రూ.40 లక్షలు విలువ చేసే పైపులు దగ్ధమయ్యాయి. మున్సిపాలిటీ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం రూ.167.89 కోట్ల భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. పైపులైన్లు వేసేందుకు అవసరమైన ప్లాస్టిక్ పైపులను పెదబొడ్డేపల్లి విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డు పక్కన నిల్వ చేశారు. వీధుల్లోని చెత్తను తీసుకొచ్చి పైపులు సమీపంలో వేస్తున్నారు. గురువారం ఆ దారిన వెళ్లేవారు సిగరెట్టు లేక అగ్గిపుల్ల విసిరి ఉండవచ్చని, లేదా ఎవరైనా చెత్తకు నిప్పు పెట్టడం వల్ల మంటలు వ్యాపించి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. పైపులు కాలి దట్టమైన పొగలు వ్యాపించి, మంటలు ఎగిసిపడడంతో స్థానికులు, మెయిన్ రోడ్డుపై వెళ్లేవారు పరుగులు తీశారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కొత్త ప్రాజెక్టు ఊసే లేదు



- ఈసారీ వాల్తేరు డివిజన్‌కు అంతంత మాత్రమే కేటాయింపులు
- దువ్వాడ–ఉత్తర సింహాచలం మధ్య 3, 4వ లైన్ల నిర్మాణానికి రూ.55 కోట్లు
- విశాఖ రైల్వే జోన్‌కు రూ.9 కోట్లు

సాక్షి, విశాఖపట్నం : పద్దు వస్తోంది.. ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయని ఎదురు చూసిన ప్రతిసారీ.. ఎక్కాల్సిన రైలు జీవిత కాలం లేటు అన్నట్లుగానే మారింది వాల్తేరు డివిజన్ పరిస్థితి. ఉన్న ప్రాజెక్టులకు విదిలింపులు కూడా అంతంత మాత్రంగానే చేస్తూ.. కొత్త ప్రాజెక్టుల గురించి కనీస ప్రస్తావన లేకుండానే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రైల్వే స్టేషన్‌కు ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు కేటాయింపుల విషయంలోనూ మరోసారి అదే ధోరణి కనబరిచారు. కొత్తగా రాయగడ డివిజన్ ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ నిర్మాణానికి రూ.9 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి మమా.. అనిపించేశారు. వాల్తేరు డివిజన్ పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్లు, లైన్ల మధ్యలో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించిన పేర్లు బడ్జెట్ ప్రతిలో కనబడుతున్నా.. కేటాయింపులు మాత్రం భూతద్దంలో వెతికేలా ఉన్నాయి. గురువారం ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ రైల్వే బడ్జెట్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోని వాల్తేరు డివిజన్‌కు జరిగిన కేటాయింపుల వివరాలివీ...

- రూ.154.28 కోట్ల వ్యయంతో వడ్లపూడి గేట్ జంక్షన్ నుంచి టై లైన్‌గా గంగవరం పోర్టు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు మొత్తం 12.04 కి.మీ 3వ, 4వ లైన్ నిర్మాణానికి గాను ఈ బడ్జెట్‌లో రూ.79.58 కోట్లు కేటాయింపులు చేశారు.
- విశాఖపట్నం–గోపాలపట్నం మధ్య 15.31 కి.మీ మేర 3వ, 4వ లైన్ల నిర్మాణానికి 159.47 కోట్లతో ప్రతిపాదనలు చేయగా ఈ బడ్జెట్‌లో రూ.55.23 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.
- పలాస–విశాఖపట్నం–దువ్వాడ మధ్య 72, 27 కి.మీ మేర బీ–రూట్ నిర్మాణానికి రూ.50 లక్షలు
- విశాఖపట్నం రైల్వే వర్క్‌షాప్‌లో కవర్డ్ షెడ్స్ విస్తరణ, మౌలిక సదుపాయాలకు రూ.11 లక్షలు
- వాల్తేరు రైల్వే స్టేషన్ పరిధిలోని పుచ్చలదిబ్బ కాలనీ రైల్వే క్వార్టర్ల అభివృద్ధికి రూ.5 లక్షలు
- దువ్వాడ–ఉత్తర సింహాచలం మధ్య రూ.302.25 కోట్లతో 3వ, 4వ లైన్ నిర్మాణానికి గాను ఈ బడ్జెట్‌లో రూ.117.18 కోట్లు కేటాయింపులు చేశారు.
- ఉత్తర సింహాచలం–గోపాలపట్నం మధ్య 2.07 కి.మీ మేర బైపాస్ లైన్ డబ్లింగ్ పనులకు రూ.వెయ్యి మాత్రమే కేటాయించారు.
- ఉత్తర సింహాచలం డబ్లింగ్ పనులకు రూ.38 కోట్లు కేటాయించారు.
- పెందుర్తి– ఉత్తర సింహాచలం మధ్య సర్ఫేస్ క్రాసింగ్‌ని తప్పించేందుకు రూ.183.65 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనలుండగా ఈ బడ్జెట్‌లో రూ.10.63 కోట్లు కేటాయించారు.

అంగరంగ వైభవంగా తులసీ తీర్థం

- తులసీ ఘాట్ వద్ద కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- 10 వేల మందికి అన్నసమారాధన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పందాలు
- భారీగా తరలివచ్చిన అభిమానులు


ఉత్సాహంగా ఎడ్ల పందాలు


గుర్రం రథంపై తులసీరావు చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగిస్తున్న దృశ్యం


గిరిజన కొమ్ము నృత్యాలు


ఆకట్టుకున్న తీన్మార్ వాయిద్యాలు

యలమంచిలి: దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు తీర్థం యలమంచిలి మున్సిపాలిటీ పెండిపాలంలో తులసీరావు ఘాట్ వద్ద గురువారం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తులసీరావు అభిమానులు, పాడి రైతులు, విశాఖ డెయిరీ కి చెందిన పాల సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి తులసీరావుతో ఉన్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అంతకు ముందు తులసీరావు కుమారుడు విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో యలమంచిలి పట్టణంలో ఆడారి తులసీరావు స్వగృహం నుంచి ఆయన చిత్రపటాన్ని గుర్రాల రథంపై ఊరేగించారు. పట్టణంలోని తులసీనగర్‌లోని పాతవీధి రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రధాన రహదారి గుండా పాత జాతీయ రహదారిపై డప్పు, సన్నాయి వాయిద్యాలు, మేళతాళాలు, మహిళల కోలాటం, చిడతలు, నేలవేషాలు, తీన్మార్ డప్పులు, థింసా నృత్యాలు, సాము గరిడీలు, తప్పెటగుళ్లు, చిటికెల భజన తదితర సాంస్కృతిక ప్రదర్శనలతో తులసీ ఘాట్ వరకు అశేష జనసంద్రం మధ్య ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి తులసీరావు కాంస్య విగ్రహాన్ని కుటుంబ సభ్యులు, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు. తులసీరావు విగ్రహానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తులసీ ఘాట్ వద్ద 10 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. తీర్థం వద్ద రంగులరాట్నాలు, ఊయలలు, జెయింట్‌వీల్ ఎక్కి ప్రజలు ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం కళాప్రదర్శనలను చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తరలివచ్చిన ప్రముఖులు

ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, గొంతిన నాగేశ్వరరావు, యలమంచిలి మండలం ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ చిన్నా, కొక్కిరాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల కొండబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు ఆడారి వెంకట్, ఆడారి నాయుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

చెల్లని చెక్కు జారీ చేసిన బిల్డర్‌కు జైలు

విశాఖ లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన బిల్డర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ నగరంలోని ఏడో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలికి రూ.45లక్షలు చెల్లించాలని అందులో స్పష్టం చేశారు. బాధితురాలి న్యాయవాది కల్యాణ చక్రవర్తి అందించిన వివరాలివీ. ఫిర్యాది నగరంలోని కిర్లంపూడి లే అవుట్ ప్రాంతానికి చెందిన మహతాబ్ ఫరిహత్ ఖానామ్. ఆమె అంధురాలు. నిందితుడు అడపా నరసింహరావు బిల్డర్. మాధవధార ప్రాంతంలో ఉంటున్నాడు. చినముషిడివాడలో నిర్మిస్తున్న ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కోసం బాధితురాలు రూ.25,43,000లను పలు దఫాలుగా అతనికి చెల్లించారు. ఫిర్యాది ఎన్నిసార్లు కోరిన ఫ్లాట్ ఇవ్వలేదు. సొమ్మును కూడా వాపస్ చేయలేదు. ఈ క్రమంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. బాధితురాలు చెల్లించిన సొమ్ముతోపాటు వడ్డీతో సహా రూ.45 లక్షలు ఆమెకు ఇవ్వడానికి బిల్డర్ అంగీకరించాడు. 2022 ఫిబ్రవరి ఒకటో తేదీన నాలుగు చెక్కులను బాధితురాలికి ఇచ్చాడు. ఆ చెక్కులను ఆమె తన బ్యాంక్ ఖాతాలో వేసినా ప్రయోజనం లేకపోయింది. నిందితుడి ఖాతాలో డబ్బు లేనందున చెక్కులు నిరాదరణకు గురయ్యాయి. దీంతో న్యాయవాది ద్వారా నోటీసు జారీ చేయగా.. బిల్డర్ నుంచి స్పందన రాలేదు. దీంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.45లక్షలు బాధితురాలికి చెల్లించాలని తీర్పునిచ్చారు. అలాగే రూ.5 వేలను ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని తీర్పులో పేర్కొన్నారు.